సాక్షి
శ్రీకాకుళం
బుధవారం, 24, జనవరి, 2024



మెరుగైన ప్రవేశాలతోనే..

జీఆర్‌ఏయూ వీసీ రజిని 'సాక్షి'తో మాట్లాడారు. వర్సిటీ ప్రగతిపై తన భావాలు పంచుకున్నారు. - 10లో



బలవన్మరణాలు..

జిల్లాలో వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ముగ్గురూ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. - 10లో

న్యాయ విద్యలో తక్షణ ప్రవేశాల నిర్వహణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో న్యాయ విద్య ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల కోర్సుల్లో తక్షణ ప్రవేశాలు మంగళవారం నిర్వహించారు. లాసెట్ - 2023 కౌన్సెలింగ్‌లో 40 సీట్లకు 29 ప్రవేశాలు జరిగాయి. 11 సీట్లు ఖాళీ ఉండగా, 21 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉన్నత విద్యా మండలి నిబంధనలు మేరకు లాసెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కల్పించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, కోర్సు కోఆర్డినేటర్ వై. రాజేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

నేడు రథసప్తమి టెండర్లు



అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఫిబ్రవరి 16న రథసప్తమి ఉత్సవానికి చెందిన పలు పనుల టెండర్ల ప్రక్రియ బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రకటనలో వివరాలను వెల్లడించారు. బుధవారం ఉదయం 10 గంటలకు భక్తుల దర్శనాల మార్గాల్లో క్యూలైన్ల ఏర్పాటుకు, ఉదయం 11 గంటలకు విద్యుత్ అలంకరణ, 12 గంటలకు షామియానాలు, టెంట్లు, కార్పెట్ల ఏర్పాటు, అలాగే మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయంలో రంగులు వేసేందుకు కూలీ ఖర్చుల నిమిత్తం బహిరంగ వేలం, టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ మేరకు మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించనున్న రంగుల టెండర్‌కు మాత్రమే రూ.20 వేలు, మిగిలిన మూడు టెండర్లకు రూ.50 వేల చొప్పున ఇఎండి/డీడీ చెల్లించాల్సి ఉంటుందని నిబంధనలను వివరించారు. అలాగే బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు గతంలో వాయిదా పడిన తలనీలాల షార్టు టెండర్ వేయనున్నారు. మరిన్ని వివరాలకు 8978914660, 9491000708 నంబర్లకు సంప్రదించాలని ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



జగ్గుశాస్త్రులపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ నవీన్

ఆమదాలవలస: పురపాలక సంఘం పరిధిలోని జగ్గుశాస్త్రులపేట పీఎస్ నంబరు 30 పోలింగ్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ నవీన్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సన్నాహకంలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాల ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు. ముందస్తుగానే పోలింగ్ కేంద్రాలను సంసిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పరిశీలనలో కమిషనర్ ఎం.రవి సుధాకర్, ఏఈ కె.అప్పలనాయుడు, టీపీఎస్ హెచ్‌వీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అమ్మవారి ఆలయంలో యాగశాల నిర్మాణం



నీలమణిదుర్గ ఆలయంలో నిర్మిస్తున్న యాగశాల

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఆలయంలో నూతన యాగశాల, కుంకుమ పూజ మండపం నిర్మాణం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవ రావు సోమవారం తెలిపారు. అనకాపల్లికి చెందిన వై.మోహనరావు సుమారు రూ.5.5లక్షలతో యాగశాల నిర్మాణం చేస్తున్నారని, ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని ఈఓ కోరారు.

'ప్రభుత్వానికి కృతజ్ఞతలు'



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు ప్రసాదరావు

కొత్తూరు: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించిందని, అందుకే సమ్మెను విరమించినట్లు కార్మిక సంఘం నేత సిర్ల ప్రసాదరావు అన్నారు. కొత్తూరులో మంగళవారం అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. చర్చల్లో ప్రభుత్వం తరఫున పాల్గొన్న మంత్రులు, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం నాయకులు కేవీ హేమలత, జలజాక్షి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వేడుక

ఓ వైపు ఇంటింటికీ సంక్షేమ సమాచారాన్ని నాయకులు చేరవేస్తున్నారు. మరోవైపు జన క్షేమం కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమం సేవలు అందిస్తోంది. ఇంకోవైపు అర్హులకు న్యాయం చేసేందుకు కులగణన చేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయి. ఓ వైపు ఆసరా వంటి పథకాల నగదు నేరుగా ఖాతాలకే జమైపోతుంటే.. మరోవైపు గడపగడపకూ మన ప్రభుత్వం, కుల గణన, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి.



పొందూరు: తాడివలసలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ వృద్ధురాలికి పథకాల లబ్ధిని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం




కొత్తూరు: సోమరాజపురం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో సుగర్ టెస్టు చేయించుకుంటున్న ఆకులతంపర సర్పంచ్ టీడీపీ నాయకుడు నాగళ్ల అప్పన్న



జి.సిగడాం: చీడిపేటలో కులగణన చేస్తున్న సచివాలయ సిబ్బంది

అచ్చెన్న..
సీను చినిగినట్లేనా!

- అచ్చెన్నను ఏ మాత్రం పట్టించుకోని బాబు, లోకేష్
- రాష్ట్ర అధ్యక్షుడి ప్రమేయం లేకుండానే అభ్యర్థుల ఎంపిక
- సిక్కోలు జిల్లా విషయంలోనూ అంతే
- స్వయంగా తన నిస్సహాయతను స్పష్టం చేసిన నేత
- చినబాబు లోకేష్‌తో విభేదాల ఫలితం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అచ్చెన్నాయుడు పని అయిపోయినట్టేనా..? కింజరాపు వారి ఆధిపత్యానికి గండి పడినట్టేనా..? హోదా, పదవి అన్నీ ఉత్తుత్తివేనా..? అంటే అన్నింటికీ ఔననే సమాధానమే వినిపిస్తోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఉన్న అచ్చెన్నాయుడికి అధిష్టానం మాటమాత్రమైనా చెప్పకుండా టికెట్లు ఖరారు చేస్తోంది. మరీముఖ్యంగా సొంత జిల్లా శ్రీకాకుళంలోని సీట్ల విషయమై కూడా ఆయనతో సంప్రదించడం లేదు. తాజాగా నరసన్నపేట నాయకులతో అచ్చెన్నాయుడు అన్న మాటలు అందుకు ఊతమిస్తున్నాయి. బగ్గు రమణమూర్తి టిక్కెట్ విషయంలో మాట్లాడాలని తనను సంప్రదించిన నాయకులతో 'నా చేతిలో ఏమీ లేదు.. నేనేమి చేయలేన'ని చెప్పడం చర్చనీయాంశమైంది. దీనికంతటికీ లోకేష్‌తో ఉన్న గ్యాపే కారణమని తెలుస్తోంది.

పొలిటికల్ టాక్

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కుమారుడు లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మధ్య గ్యాప్ ఉంది. తన ఇమేజ్ డ్యామేజ్ చేసేలా అచ్చెన్నాయుడు వ్యవహరిస్తున్నారని లోకేష్ కసితో ఉన్నారు. 'పార్టీ లేదు.. బొక్కా లేదు.. ఆడే బాగుంటే ఇంకేం కావాలి..' అని తిరుపతి లోకసభ ఉప ఎన్నికల సమయంలో ఓ హోటల్‌లో అచ్చెన్నాయుడు అన్న మాటలు వైరల్ అయి రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీని కుదిపేశాయి. ఆ సమయంలో లోకేష్ పరువు మంట కలిసిపోయింది. అప్పటి నుంచి వారి మధ్య పోరు నడుస్తూనే ఉంది. అగ్నికి ఆజ్యం పోసినట్టు లోకేష్ చేసిన పాదయాత్రపైన, హాజరవుతున్న జనంపైన, చేయాల్సిన జన సమీకరణపైన గంగాధర నెల్లూరు టీడీపీ ఇన్‌చార్జి చిట్టిబాబునాయుడుతో అచ్చెన్నాయుడు ఫోన్ సంభాషణ బయటికి రావడం లోకేష్‌తో మరింత గ్యాప్ తెచ్చి పెట్టింది. పాదయాత్రను చులకన చేసేలా అచ్చెన్నాయుడు మాట్లాడిన తీరు లోకేష్‌ను మరింత ఆగ్రహానికి గురిచేసింది. దీంతో వారి మధ్య గ్యాప్ నడుస్తోంది. ఇప్పుడా గ్యాప్ కీలక సమయంలో ప్రభావం చూపుతోంది.

'కళా'తో బయటపడ్డ విభేదాలు..

బగ్గు రమణమూర్తి విషయంలో అచ్చెన్న స్పందించిన తీరుతో కళా వెంకటరావుతో ఉన్న విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. గత పదేళ్లుగా వారి మధ్య విభేదాలు ఉన్నట్టుగా తాజా వ్యాఖ్యలు రుజువు చేసినట్టు అయింది. ఇప్పుడా గ్యాప్ మరింత ఎక్కువైనట్టు తెలుస్తోంది. లోకేష్‌తో అచ్చెన్నకు చెడటం, కళాతో లోకేష్ సాన్నిత్యం పెరగడం, టిక్కెట్ల ఖరారులో అధిష్టానం విలువ ఇవ్వకపోవడం వెరసి టీడీపీలో ప్రచ్ఛన్న యుద్ధం తార స్థాయికి చేరిందనే విషయం స్పష్టమవుతోంది. జరుగుతున్న పరిణామాలు చూసి అచ్చెన్న పని అయిపోయిందన్న చర్చకు తావిస్తోంది. ఎన్నికలయ్యాక మరింత పక్కన పెట్టేస్తారన్న వాదన కూడా ఉంది.

దక్కని ప్రాధాన్యం

టిక్కెట్ల ఖరారు విషయంలో రాష్ట్రంలోనే కాదు సొంత జిల్లా టిక్కెట్ల ఖరారులో కూడా అచ్చెన్నకు కనీసం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. అచ్చెన్న పేరు చెప్పినా.. ఆయనతో కలిసి వెళ్లినా టిక్కెట్ ఉండదనే సంకేతాలను లోకేష్ కోటరీ పంపించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం సర్వైవల్ కోసం లోకేష్, అచ్చెన్న కలిసి ఉంటున్నారని, మార్చితే సామాజిక వర్గ పరంగా వ్యతిరేకత మూట గట్టుకోవాల్సి వస్తుందని ఉద్దేశంతోనే అచ్చెన్నను అధ్యక్షుడిగా కొనసాగిస్తున్నారన్న వాదన కూడా ఉంది. ఏదేమైనప్పటికీ తన కేదో సాయం చేస్తారని అచ్చెన్న వద్దకు వెళ్లిన నరసన్నపేట నాయకుల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అయింది. నరసన్నపేట టిక్కెట్ కోసం మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, డాక్టర్ బగ్గు శ్రీనివాసరావు మధ్య పోటీ నెలకొంది. డాక్టర్ బగ్గు శ్రీనివాసరావుకే ఇప్పటికే టిక్కెట్ ఖరారైపోయిందన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఈ సమయంలో బగ్గు రమణమూర్తి అనుచరులు కొంత మంది సోమ వారం నిమ్మాడ వెళ్లి అచ్చెన్నాయుడిని కలిశారు. ఈ సమయంలో అచ్చెన్న స్పందించిన తీరుతో నాయకులంతా అవాక్కయ్యారు. తన చేతిలో ఏమీ లేదని, తానేమీ చేయలేనని, టిక్కెట్ వ్యవహారం గురించి తెలియదు అని ఏక వాక్యంలో చెప్పేయడంతో అక్కడున్న నాయకులంతా కంగుతిన్నారు.

వైరాగ్యంలోనూ రమణమూర్తిపై అక్కసు..

అధిష్టానం తనను పక్కన పెట్టేసిందన్న వైరాగ్యంలో ఉన్న సమయంలో బగ్గు రమణమూర్తిపై అచ్చెన్నాయుడు తన అక్కసు వెళ్లగక్కారు. 2014లో రమణమూర్తికి టిక్కెట్ వచ్చేలా చేస్తే పట్టించుకోలేదని, తన వ్యతిరేకులతో కలిసి తిరిగారని, వారితో వ్యాపార వ్యవహారాలు నడిపారని, ఆయన పెద్ద వాడని, తనతో ఆయనకు పని ఏంటని ఎత్తిపొడుపు మాట్లాడినట్టు పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. దీంతో తన దగ్గరకు వచ్చిన నాయకులంతా డిఫెన్స్‌లో పడ్డారు. ఇంకేమీ మాట్లాడకుండా వెనకొచ్చేశారు. ఇదే విషయాన్ని రమణమూర్తి వద్ద నాయకులు చెప్పగా టిక్కెట్ ఎలా తెచ్చుకోవాలో నాకు తెలుసునని అచ్చెన్నకు చురక అంటించే విధంగా బదులిచ్చారు. ఇప్పుడిది నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

భలే ఉంది భోజనం



విద్యార్థులు, స్కూల్ హెచ్‌ఎంతో కలసి భోజనం చేస్తున్న ఎస్ఎస్‌ఏ సోషల్ ఆడిట్ టీమ్ సభ్యులు

నరసన్నపేట: 'ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఎంతో రుచికరంగా ఉంది. స్కూల్స్‌లో మౌలిక వసతులు బాగా మెరుగుపడ్డాయి. పాఠశాలల్లో అభివృద్ధి పనులు సంతృప్తిగా ఉన్నాయి.' అని ఎస్ఎస్ఏ సోషల్ ఆడిట్ టీమ్ సభ్యులు బి.సూర్య, డీఆర్‌పీ విద్యాసాగర్(విజయవాడ) అన్నారు. మండలంలోని ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం వీరు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనానికి సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాలు, వంటలు పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, హెచ్‌ఎంతో కలసి మధ్యాహ్న భోజనం తిన్నారు. భోజనం భలేగా ఉందని మెచ్చుకున్నారు. రోజూ ఇలానే రుచికరంగా వంటలు ఉంటాయా అని విద్యార్థులను ప్రశ్నించారు. ఇలానే ఉంటాయని విద్యార్థులు చెప్పడంతో వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు పాఠశాలకు మంజూరైన నిధులు, వాటి వినియోగం గురించి ఆరా తీశారు. మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల ఆవరణలో జగనన్న స్వచ్ఛ సంకల్పం తీరును పరిశీలించి అభినందించారు. హెచ్‌ఎం హర్షవర్ధన్ శర్మతో పాటు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

'వైద్యారోగ్య శాఖలో రచ్చరచ్చ'పై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్...

అరసవల్లి: 'జిల్లా వైద్యారోగ్యశాఖలో రచ్చ రచ్చ' పేరిట సాక్షిలో మంగళవారం ప్రచురించిన కథనంపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సీరియస్‌గా స్పందించారు. మంగళవారం ప్రచురించిన కథనంపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించి అక్రమార్కుల వివరాలపై ఆరా తీశారు. వైద్యారోగ్య శాఖలో ఉద్యోగాల పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడి, తీరా ఆ మరకను జిల్లా ఉన్నతాధికారులకు అంటించేలా రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు లేఖలు పంపిన ఆ 'ఇద్దరి'పై చర్యలకు కలెక్టర్ రంగం సిద్ధం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈమేరకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షికి తగిన ఆదేశాలు ఇచ్చేశారు. నిబంధనల ప్రకారం అవసరమైతే రీజనల్ డైరెక్టర్‌తో మాట్లాడాలని సూచించినట్లుగా సమాచారం. ఒకట్రెండు రోజుల్లో అసలు వ్యవహారాలు నడిపిన వారిపై చర్యలు తీసుకునే అవకాశాలున్నట్లుగా జిల్లా కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

తండ్రి ఆశయాల మేరకే
వైఎస్ జగన్ పాలన



నమూనా చెక్కును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, శ్రీకాకుళం పార్లమెంట్ ఇన్‌చార్జి పేరాడ తిలక్, జేసీ నవీన్ తదితరులు

- 4వ విడత ఆసరా నిధులు విడుదల కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్
- అక్కచెల్లెమ్మల ఖాతాలో రూ.309 కోట్లు జమ

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ ఆసరాతో మహిళలకు సామాజిక, ఆర్థిక భరోసాతో పాటు గౌరవం వచ్చిందని, తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాల మేరకు కొడుకు వైఎస్ జగన్ ప్రజా రంజక పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వైఎస్సార్ ఆసరా నాల్గో విడత కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లాలో ప్రారంభించారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణదాస్ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు విడతల్లో పూర్తి సొమ్ము చెల్లించారని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 4 విడతలకు 42,374 ఎస్ హెచ్‌జీ సంఘాలలో 4,54,111 మంది సభ్యులకు రూ.1238.65 కోట్లు వైఎస్సార్ ఆసరా కింద లబ్ధిదారులకు అందజేశామన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని అన్నారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతిదీవెన, ఆసరా, చేయూతతో పాటు గృహాలను కూడా మహిళల పేరునే మంజూరు చేస్తున్న సంగతిని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబులు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని మహిళా సంఘాలను కోరారు. ఈ ప్రభుత్వం వల్ల మేలు జరిగిందని భావిస్తే దీవించాలని అన్నారు. డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ డి.విద్యాసాగర్ మాట్లాడుతూ జిల్లాలో ఆసరా క్రింద వచ్చిన ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆసరా నాల్గో విడత కింద 4.54 లక్షల మంది పొదుపు సంఘాల్లోని అక్క చెల్లెమ్మలకు రూ.309.77 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్య కిరణ్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.కృష్ణవేణి, పొందర, కూరాకుల, శ్రీశయన, కార్పొరేషన్ల చైర్మన్లు రాజాపు హైమావతి అప్పన్న, డీపీ దేవ్, సుడా చైర్ పర్సన్ కోరాడ ఆశాలత, చంద్రభూషణ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కలకాలం వైఎస్ జగన్ సీఎంగా ఉండాలి



సీఎంగా వైఎస్ జగన్ కలకాలం ఉండాలి. ఆయన పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన పథకాలు కొనసాగాలి. ఆసరా మూడు విడతల డబ్బు నా ఖాతాలో పడింది. ఆ డబ్బు, జగనన్న తోడుతో వచ్చి నగదు కలిపి ఆవును కొని పాలు అమ్ముకుని బతుకుతున్నాను. నా ఇంటిలో పింఛను, అమ్మ ఒడి వంటి ప్రయోజనాలు కలిగాయి. ఇలా ఇంకెవ్వరూ పరిపాలించలేరు.

– ఎస్.రమణమ్మ, పూడివలస, ఎచ్చెర్ల మండలం

జగన్‌కు ఎవరూ సాటిరారు



సంక్షేమ పాలనలో సీఎం వైఎస్ జగన్‌కు ఎవరూ సాటిరారు. కూలి పనిచేసుకుని ఉండే మాకు సొంత పాడి ఆవు, పిల్లలు చదువులు చక్కగా సాగుతున్నాయంటే జగనన్న సాయం వల్లనే. ఇన్ని సంక్షేమ పథకాలు గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టలేదు. ప్రతి సంక్షేమ పథకం ఎవరితో సంబంధం లేకుండా నేరుగా ఖాతాకే జమైపోతోంది. మహిళంతా ఈ సారి కూడా వైఎస్ జగన్‌కు అండగా నిలవాలి.

– డి.రాజేశ్వరి, ఇబ్రహీంబాద్, ఎచ్చెర్ల మండలం

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



డి.కేశవరావు భార్య కృష్ణవేణికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన డి.కేశవరావు భార్య కృష్ణవేణికి ప్రభుత్వం మంజూరు చేసిన విడో ఫండ్, ఫ్లాగ్ ఫండ్ కలిపి రూ.75 వేల చెక్కును ఎస్పీ జీఆర్ రాధిక మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కేశవరావు కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన మిగిలిన ప్రయోజనాలను సకాలంలో అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు. జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కృష్ణవేణికి భరోసా ఇచ్చారు.

విధుల్లో చేరిన 95 శాతం అంగన్‌వాడీలు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో 95శాతం మేర అంగన్‌వాడీ వర్కర్లు విధుల్లో చేరారని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతిశ్రీ మంగళవారం రాత్రి పేర్కొన్నా రు. గత కొద్ది రోజులుగా తమ డిమాండ్ల సాధనకై సమ్మెలో పాల్గొంటున్న అంగన్ వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో విధుల్లో చేరారని ఆమె పేర్కొన్నారు. మిగతా 5శాతం కూడా బుధవారం విధుల్లో చేరే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు విధుల్లో చేరినవారు తమ పరిధి పీఠ వద్ద జాయినింగ్ రిపోర్టు తీసుకొని కేంద్రాల్లో చేరారని తెలిపారు.



శంబర పోలమాంబ సిరిమానోత్సవ సందడి (ఇన్‌సెట్లో) శంబర పోలమాంబ అమ్మవారు



తిరువీధికి బయలుదేరిన అమ్మవారి ఘటాలు

పాహిమాం పోలమాంబ

అంబరాన్నంటిన 'శంబర'ం • కనుల పండువగా శంబర పోలమాంబ సిరిమానోత్సవం

శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. సిరిమాను పూజారి రూపంలో అమ్మవారు మక్కువ మండలంలోని శంబర వీధుల్లోకి అరుదెంచిన వేళ భక్తులు పులకించిపోయారు. పూజారి జన్ని పేకాపు భాస్కరరావు, అలియాస్ జగదీశ్వరరావు సిరిమానును అధిరోహించారు. రాష్ట్రంలోని నలుమూలలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. గోముఖినదిలో పుణ్యస్నానాలాచరించారు. –మక్కువ

ప్రాణం విలువ గుర్తించాలి



అవగాహన కల్పిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: వాహన చోదకులు ప్రాణం విలువ గుర్తించి బండి నడపాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.అనిల్ అన్నారు. ఎచ్చెర్లలోని రోడ్డు రవాణాశాఖ కార్యాలయంలో వాహనచోదకులకు రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించటం, పరిమితిలో వేగం పాటించడం, నిద్ర మత్తులో వాహనాలు నడపకపోవటం, సీటు బెల్టు ధరించడం కీలకమని చెప్పారు. నిర్లక్ష్యపు డ్రైవింగే రోడ్డు ప్రమాదాలకు కారణమని తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పీవీ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.రెండు వందల కోట్లతో జలజీవన్ పనులు



చీడిపేటలో జల్‌జీవన్ పనుల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈఈ

జి.సిగడాం: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారుగా రూ.రెండు వందల కోట్లతో జలజీవన్ పనులు జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పైడి సూర్యనారాయణ వెల్లడించారు. ఆయన మంగళవారం మండలంలోని విజయరాంపురం, దవళపేట, చీడిపేట, వాండ్రంగి, గ్రామాల్లో పలు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయడంతో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని తెలిపారు. దవళపేట, వాండ్రంగిలో ట్యాంకు పనుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి, సర్పంచులు సాకేటి నాగరాజు, వడిశ మహేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మాచర్ల గోపాలం, ముగ్గు లోకేష్ ఉన్నారు.

మెరుగైన ప్రవేశాలతోనే.. కోర్సుల మనుగడ

- ఉత్తమ వర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా
- జీఆర్ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని

సాక్షి ఇంటర్వ్యూ



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రతి కోర్సును బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, విద్యార్థుల చేరిక ఆధారంగానే కోర్సుల మనుగడ ఆధారపడుతుందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. ఇటీవలే వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆమె మంగళవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్రంలోనే ఉత్తమ విశ్వవిద్యాలయంగా వర్సిటీని తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. మెరుగైన ప్రవేశాలు, రిలీవ్ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు.

సాక్షి: వర్సిటీలో 98 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రక్రియ ఏ దశలో ఉంది?

వీసీ: రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఇక్కడ వర్సిటీలో సైతం నియామకాలు ప్రభుత్వ నిబంధనల మేరకు జరుగుతాయి. కోర్టులో కేసులు ఉన్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుగుణంగా ముందుకు సాగుతాం.

సాక్షి: ఆర్ట్స్ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయి. ప్రవేశాల మెరుగుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

వీసీ: ఇక్కడే కాకుండా అంతర్జాతీయంగానూ ఆర్ట్స్ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఆధారంగానే విద్యార్థులు చేరుతున్నారు. సిలబస్‌లో మార్పులు, ఉన్నత విద్యామండలి నిబంధనలు మేరకు కోర్సులు కొనసాగింపు వంటివి పరిశీలిస్తాం. విద్యార్థుల ప్రవేశాలతోనే కోర్సుల మనుగడ సాధ్యం.

సాక్షి: అవసరానికి మించి నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలుపై మీ అభిప్రాయం ?

వీసీ: పాలక మండలి, ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయం ఆధారంగా నియామకాలు ఉంటాయి. వ్యక్తిగత ప్రయోజనాలు ఉండవు.

సాక్షి: దయల్ యువర్ యూనివర్సిటీ కొనసాగింపుపై మీ నిర్ణయం?

వీసీ: దయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ ఇన్ లైన్ భవిష్యత్తులోనూ కొనసాగుతుంది. దీంతో పాటు ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ నిర్వహించి విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటాను.

సాక్షి: పరీక్షలు ఫలితాలు, రీవేల్యూయేషన్ ఫలితాల్లో జాప్యమెందుకు?

వీసీ: ఈ అంశం నా దృష్టికి వచ్చింది. తప్పకుండా దృష్టిపెడతా. సకాలంలో పరీక్షలు, రీవాల్యుయేషన్ ఫలితాల విడుదలపై దృష్టిపెడతాను.

సాక్షి: డిప్లమా, సర్టిఫికెట్ కోర్సులు నిర్వహణపై అభిప్రాయం?

వీసీ: విద్యార్థులు ప్రయోజనం, వర్సిటీ ఆర్థిక ప్రయోజనాలు ఆధారంగా డిప్లమా, సర్టిఫికెట్ కోర్సులు నిర్వహణపై దృష్టిపెడతాం.

సాక్షి: ప్రస్తుతం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కొనసాగుతున్నారు. రెగ్యులర్ నియామకంపై మీ అభిప్రాయం?

వీసీ: వర్సిటీ పాలనపై కొన్ని నెలల్లో పట్టు సాధిస్తా. తదుపరి అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు ఉంటాయి.

సాక్షి: ఆర్ట్స్ కోర్సులకు సింగిల్ సెక్షన్ అమలు చేస్తారా?

వీసీ: ప్రస్తుతం ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు క్లాస్ వర్క్ జరుగుతుంది. కొన్ని నెలలు తరువాత ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న అంశం పరిశీలిస్తా.

సాక్షి: వర్సిటీ ఉద్యోగుల సమయపాలనపై మీ అభిప్రాయం?

వీసీ: నేను సమయపాలన కంటే అరగంట ముందు వర్సిటీకి చేరుకుంటాను. రిజిస్టర్లు, బయోమెట్రిక్ హాజరు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాను.

● వైఎస్సార్ సీపీలో 300 మంది చేరిక

గార మండలం బందరువానిపేట గ్రామానికి చెందిన 300 మంది మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పెదపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

– శ్రీకాకుళం రూరల్



ప్రజాద్రోహి చంద్రబాబును తరిమికొట్టాలి



భోగాపురంలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

- ఓటుతో బుద్ధి చెప్పాలి
- మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: ప్రజలకు అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబుకు ఎవరూ సరిలేరని, పథకాల పేరిట ఎన్నికల మోసాలకు తెరతీసిన చంద్రబాబును తరిమికొట్టాలని రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలం భోగాపురం, పొత్తంగి పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో రుణమాఫీ పేరిట మహిళలను మోసం చేశారన్నారు. టీడీపీని నమ్మితే కుచ్చుటోపీ తప్పదన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలపై నిన్న మొన్నటి వరకు గగ్గోలు పెట్టిన చంద్రబాబు అందులోని కొన్ని పథకాలను కాపీ కొట్టి.. అమలు చేస్తామని చెప్పడం వెనుక ఉన్న అంతర్యాన్ని ప్రజలు గమనించాలన్నారు. జగనన్న పాలనతోనే సంక్షేమం సాధ్యపడుతుందని, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత అందరిపైనా ఉందన్నారు. అయోధ్య రామయ్య చేతిలో రామబాణం ఎంతో శక్తివంతమైందో.. ప్రజాస్వామ్యంలో ఓటు కూడా అంతే శక్తివంతమైందన్నారు. ఓటు అనే బాణాన్ని సంధించి తెలుగుదేశం పార్టీని నామరూపాల్లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. 60ఏళ్ల గోతు పాలనలో ఒరిగింది శూన్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సారి పద్మనాభంచౌదరి పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సారి రంజిత చౌదరి, దల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, జిల్లా కార్యదర్శి దల్లి జానకిరావురెడ్డి, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సాంర్ర ఢిల్లేశ్వరరావు, కంచిలి ఏఎంసీ చైర్మన్ బదకల మోహనరావు, ఎంపీటీసీ నల్ల అనితాచౌదరి, బుడారిసింగి సర్పంచ్ సురేష్‌కుమార్ పాణిగ్రాహి, ప్రసన్నకుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం



హనుమంతు కృష్ణారావుతో పేరాడ తిలక్



మామిడి శ్రీకాంత్‌ను కలిసిన పేరాడ తిలక్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పేరాడ తిలక్‌ను పార్టీ అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జిల్లాలో పలువురు రాజకీయవేత్తలను, ప్రముఖులను తిలక్ కలుస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కళింగకుల సంఘ అధ్యక్షుడు హనుమంతు కృష్ణారావులను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు సహకరించాలని కోరారు. తిలక్‌తో పాటు కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ఎన్ని ధనుంజయరావు, దుబ్బ వెంకటరమణ, రాజు తదితరులు ఉన్నారు.

సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్‌పై దాడి



జె.ఆర్.పురం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

రణస్థలం: మండలంలోని కొవ్వాడ గ్రామంలో సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న చుక్క కొర్లయ్యపై అదే గ్రామానికి చెందిన ఆకుల్ల రాముడు దాడి చేసినట్లు విద్యుత్ ఉద్యోగులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో డి-లిస్టు ఆపరేటింగ్ పనిచేస్తున్న కొర్లయ్యపై ఆకుల్ల రాముడు, అతని అనుచరులు దాడి చేసి బైక్ తాళం తీసుకున్నారు. మూడు నెలలకు కలిపి ఇంటి కరెంట్ బిల్లు రూ.1063 రావడం, బిల్లు చెల్లించకపోవడంతో ఏఈ ఆదేశాల మేరకు విద్యుత్ కనెక్షన్ కట్ చేయడంతో ఈ దాడికి పాల్పడ్డాడు. తక్షణమే నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ మాట్లాడుతూ దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీఈ యు.వి.రమణమూర్తి, ఎచ్చెర్ల, పైడిభీమవరం ఏఈలు కె.హరికృష్ణ, జి.శ్రీనివాససాహు, లైన్‌మేన్ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పూండిలో దొంగల హల్‌చల్

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి వ్యాపార కేంద్రంలో సోమవారం రాత్రి దొంగలు చొరబడ్డారు. బస్టాండ్ ప్రాంతంలో శ్రీనివాసనగర్‌కు చెందిన విశ్రాంత ఆర్మీ జవాన్ వానపల్లి మన్మథరావుకు చెందిన పల్సర్ బైక్‌ను ఇంటి పక్కన ఉన్న రేకుల షెడ్‌లో ఉంచగా అర్ధరాత్రి దుండగులు చొరబడి పట్టుకుపోయారు. అదే రోజు రాత్రి బస్టాండ్ రోడ్డులోని కవిటి చలపతిరావు పండ్ల దుకాణంలో రూ.17వేలు నగదు, గణేష్ స్వీట్ దుకాణంలో రూ.7వేలు నగదు చోరీ చేశారు. సమాచారం అందుకున్న వజ్రపుకొత్తూరు ఎస్ఐ వై.మధుసూధనరావు, సిబ్బందితో కలిసి నిందితుల కోసం గాలిస్తున్నారు. బాధితుడు మన్మథరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి



సోమేశ్వరరావు(ఫైల్)

నందిగాం : ఈ నెల 17 నుంచి కనిపించకుండాపోయిన నందిగాంకు చెందిన కొన్న సోమేశ్వరరావు(53) వజ్రపుకొత్తూరు మండలం బెండి రైల్వే బ్రిడ్జి కింద ఉన్న వాగులో శవమై తేలాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమేశ్వరరావు కనిపించకపోవడంతో సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడంతో పాటు నందిగాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంతలో సోమవారం బెండి గేటు సమీపంలో ట్రాక్ పరిశీలిస్తున్న సిబ్బందికి బ్రిడ్జి క్రింద ఉన్న వాగులో శవం కనిపించింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు మృతుడు వేసుకున్న షర్టును బట్టి సోమేశ్వరరావుగా గుర్తించారు. పలాస రైల్వే ఎస్సై ఎస్‌కే షరీఫ్ ఆధ్వర్యంలో శవపంచనామా జరిపి మృతదేహాన్ని మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు.

వర్సిటీ స్వయం ప్రతిపత్తి కాపాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా ప్రైవేట్ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి కాపాడాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం వర్సిటీ ఆవరణలో ర్యాలీ నిర్వహించిన కాలేజీల యాజమాన్య ప్రతినిధులు వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతులు డిగ్రీ కోర్సులకూ అవసరమైతే కళాశాలలకు ఆర్థిక భారమని చెప్పారు. తక్కువ ఫీజు స్ట్రక్చర్‌తో నిర్వహిస్తున్న కళాశాలలకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఇబ్బంది కలుగుతుందన్నారు. ఇప్పటికే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలు డిగ్రీ కళాశాలు పాటిస్తున్నాయని గుర్తు చేశారు. బీబీఏ, బీసీఏ కోర్సుకు ఐదు లక్షలు సెక్యూరిటీ డిపాజిట్ కట్టడం సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నాల జయరాం, సెక్రటరీ కోట మురళీధర్, కోశాధికారి బింగి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షకులకు దరఖాస్తుల ఆహ్వానం

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్లా ప్రభుత్వ హోమియో వైద్యశాల, హెల్త్, వెల్‌నెస్ కేంద్రంలో పార్ట్ టైమ్ యోగా శిక్షకులుగా పనిచేసేందుకు ఆసక్తిగల స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హోమియో వైద్యాధికారి దుర్గాప్రసాద్ పట్నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాలో డిప్లమా, డిగ్రీ/పీజీ సర్టిఫికెట్ కలిగిన వారు ఈ నెల 24 ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 94401 68430 నంబరును సంప్రదించాలని కోరారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

- రెండేళ్ల కిందట భార్య, సోదరి దారుణ హత్య
- ఆ కేసులో శిక్ష పడుతుందని ఆందోళనతో ఉరేసుకున్న వైనం



మృతి చెందిన అప్పన్న

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని పొన్నాడ పంచాయతీ ముద్దాడపేటకు చెందిన రీసు అప్పన్న(50) మద్యం మత్తులో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పన్న కొంతకాలంగా అరకు ప్రాంతంలో గృహ నిర్మాణ రంగంలో టైల్స్ అమర్చే పనులు చేస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. 2022 జనవరి 29న కుటుంబ కలహాల నేపథ్యంలో మద్యం మత్తులో భార్య అప్పమ్మ, అక్క రాజులను కిరాతకంగా కత్తితో నరికి చంపాడు. దీంతో కుటుంబ సభ్యులు ఇంటి నుంచి ఇతర ప్రాంతానికి వెళ్లి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం హత్య కేసు శ్రీకాకుళం కోర్టులో విచారణకు వచ్చింది. అరకు నుంచి ఇంటికి వచ్చిన అప్పన్న మద్యం మత్తులో మానసిక ఆందోళనకు గురయ్యాడు. హత్య కేసులో శిక్ష పడితే జైలు జీవితం గడపాల్సి వస్తుందని మానసిక ఒత్తిడికి గురై తన ఇంటి తలుపులు వేసుకొని శ్లాబ్ హుక్‌కు మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఉరి వేసుకున్నాడు. సాయంత్రమైనా బయటకు రాకపోవటంతో అనుమానం వచ్చి స్థానికులు తలుపులు తెరవగా విగతజీవిగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ వి.సత్యనారాయణ, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బారువ మేజర్ పంచాయతీ సర్పంచ్ మృతి



సంతాపం తెలియజేస్తున్న పిరియా సాయిరాజ్, ఎంపీపీ నిమ్మన దాస్ తదితరులు

సోంపేట: బారువ మేజర్ పంచాయతీ సర్పంచ్, పర్యావరణ పరిరక్షణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మడే శరత్‌చంద్రుడు సోమవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ యారాడి కృష్ణమూర్తి, కార్యదర్శి బీన ఢిల్లీరావు మంగళవారం గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి నివాళులు అర్పించారు. శరత్‌చంద్రుడు బారువ మేజర్ పంచాయతీకి మూడు సార్లుగా సర్పంచ్‌గా పనిచేశారు. థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని చిత్తడి నేలలో నిర్మిస్తే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని ఉద్యమంలో కీలక పాత్ర వహించి , పోలీసులతో లాఠీ దెబ్బలు తిన్నారు. శరత్‌చంద్రుడు మృతి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గురాల శ్రీను, బారువ సర్పంచ్ యర్ర రజినీ, పార్టీ నాయకులు మద్దు రాజారావు, పాతిన శేషగిరి, సంగారు గోవిందు, కొంచాడ నెహ్రూ, పి.రాజేశ్వరరావు, మానవ హక్కుల నాయకులు వి.ఎస్.కృష్ణ, కె.వి.జగన్నాథరావు, ఫల్గుణరాజు పాల్గొన్నారు.

జీడి చెట్టుకు ఉరి వేసుకుని..



మృతిచెందిన అప్పలనాయుడు

టెక్కలి రూరల్: మండలంలోని బన్నువాడు పంచాయతీ మోదుగవలస గ్రామ సమీప తోటల్లో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... టెక్కలి చిన్న చేరివీధికి చెందిన తాపి మేస్త్రి మామిడి అప్పలనాయుడు(39) కుటుంబ కలహాలు కారణంగా ఒంటరిగా ఉండేవాడు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి ఒక్కోసారి రెండు మూడు రోజులు తర్వాత వచ్చేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం బయటకు వెళ్తానని భార్యకు చెప్పి సైకిల్‌పై వెళ్లిపోయాడు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో పలు ప్రాంతాల్లో వెతకగా.. ఇంతలో మోదుగవలస సమీపంలో తోటలోని జీడి చెట్టుకు తన స్వెట్టర్‌కు ఉన్న తాడుతో ఉరివేసుకున్నట్లు స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న భార్యా పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పలనాయుడుకు భార్య ఈశ్వరి, ఇద్దరు కుమార్తెలు నీరజ, నిరీష ఉన్నారు. ఈశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నర్సింగరావు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



ఆదినారాయణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని సుంకర జగన్నాథపురం గ్రామానికి చెందిన టెంక ఆదినారాయణ(36) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పద్మావతి, అత్త కోళ్ల కామమ్మ, బావమరిది కోళ్ల కుమార్‌ల వేధింపులు భరించలేక జీడి తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వైమధుసూధనరావు తెలిపారు. ఆదినారాయణకు పెళ్లయిన కొద్ది రోజులకే భార్య పద్మావతితో గొడవలు జరగడంతో వేరుగా ఉంటున్నాడు. ఇటీవల తగాదాలు తారస్థాయికి చేరడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదినారాయణకు కుమారుడు ప్రేమ్‌చంద్, కుమార్తె హేమలత ఉన్నారు. మృతుడి తల్లి రెయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భార్య, అత్త, బావమరిదిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.